TELTEL/2022/83842

PRABHATA GAMANAM

ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

మంగళవారం 24, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :187 | పేజీలు :4 | వెల. 3/-


3

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

- ఆచరణ ఎక్కడ?
- ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి హరీశ్ రావు
- రైతు భరోసా, రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్ వంచించింది..
- బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం
- అంకెల గారడీ.. ఆచరణలో శూన్యం:
- “నాడు ₹15 వేలు ఇస్తామని బీరాలు పలికితిరి.. ఇప్పుడేమైంది?”
- కాంగ్రెస్ గ్యారెంటీలు.. అన్నీ 'కంచె' దాటినట్లేనా?
- బడ్జెట్ అంటే అంకెల గారడీ కాదు.. ప్రజల ఆశల ప్రతిబింబం కావాలి!
- అసెంబ్లీలో ఘాటు వ్యాఖ్యలు**

# హామీలు ఏమయ్యాయి


2

"తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రతిపక్షం ప్రభుత్వంపై సంధించిన విమర్శలతో అట్టుడికాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజలకు చేకూరే లబ్ధి శూన్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. 'నాడు ఎన్నికల ప్రచారంలో ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా ఇస్తామని బీరాలు పలికిన నేతలు, నేడు అధికారంలోకి వచ్చాక ఆచరణను ఎందుకు విస్మరించారు?' అని ఆయన నిలదీశారు. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం, రుణమాఫీ, మరియు సన్నవడ్లకు బోనస్ వంటి కీలక హామీలను అటకెక్కించి రైతాంగాన్ని వంచించారని మండిపడ్డారు. మరోవైపు, రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవడానికి ఎక్సైజ్ శాఖ ద్వారా అదనంగా రూ. 12 వేల కోట్లు రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'ఆదాయం కోసం ఊరూరా బార్లు తెరుస్తారా?' అంటూ హరీశ్ రావు సంధించిన ప్రశ్నలు సభలో పెను దుమారం రేపాయి. బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, నిరుద్యోగులకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ హామీ సైతం ఈ బడ్జెట్ లో మాయం కావడం ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆయన ఘాటుగా విమర్శించారు."


- హైదరాబాద్, ప్రభాత గమనం

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎస్.రాములు నాయక్
- రైతే దేశానికి వెన్నెముక
- గడ్డి మందు నివారణకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్

— వివరాలు4వ పేజీలో..





# మా వార్డుల భాద్యత మాదే

- మా వార్డుని ఆదర్శ వార్డ్ గా తీర్చిదిద్దుకుంటాం
- ప్రతిజ్ఞ పూనిన మున్సిపాలిటీ 8,9వ వార్డ్ ప్రజలు

03


2

# ఈటల ఫైర్

- మా పరిధిలోని అభ్యర్థులను మేమే తేల్చుకుంటాం - రాజేందర్ స్పష్టీకరణ.
- సొంత పార్టీ నేతలే నాపై కుట్రలు చేస్తున్నారు
- బహిరంగంగానే మండిపడ్డ సీనియర్ నేత.
- జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ ఒక్కసారిగా వేడెక్కిన రాజకీయం.

"వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ భారతీయ జనతా పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీ రాష్ట్ర నాయకత్వ తీరుపై సీనియర్ నాయకుడు ఈటెల రాజేందర్ తిరుగుబాటు గళం వినిపించారు. తామేం పార్ట్ టైమ్ నాయకులం కాదని, తమకు తగిన గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే.. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో స్థానిక నేతలకే పూర్తి అధికారం ఉండాలని తేల్చిచెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలోనే సొంత పార్టీ నేతల కుట్రలను బట్టబయలు చేస్తూ ఈటెల చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి."

- హైదరాబాద్, ప్రభాత గమనం

మంగళవారం
24.03.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

- ఆచరణ ఎక్కడ?
- ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్ రావు
- రైతు భరోసా, రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్ ను వంచించినట్లు విమర్శలు**
- బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం - అసెంబ్లీలో ఘాటు వ్యాఖ్యలు**



హైదరాబాద్, ప్రభాత గమనం: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం వాడివేడిగా సాగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సర్కార్ పూర్తిగా విఫలమైందని, రైతులను మోసం చేస్తోందని ఆయన మండిపడ్డారు.

## రైతు భరోసాపై పలాయనవాదం

"ఎన్నికల ప్రచారంలో ఎకరానికి రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని గొప్పలు చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆచరణ ఏమైంది?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చామని గుర్తుచేసిన ఆయన, ఇప్పుడు ప్రభుత్వం రైతు భరోసాపై నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు కూడా రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు కనీసం ఒక పంటకు కూడా సరిగ్గా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు.

## బడ్జెట్ హామీలు అమలు కాలేదు

బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాలను కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటని హరీశ్ రావు విమర్శించారు.

- పంట బీమా: గత రెండు బడ్జెట్లలో ప్రకటించిన పంట బీమా పథకం ఈసారి బడ్జెట్‌లో మాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు.
- రైతు కూలీలకు సాయం: ఏటా రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్న హామీ ఇప్పటికీ కాగితాలకే పరిమితమైందని దుయ్యబట్టారు.
- జాబ్ క్యాలెండర్: గత బడ్జెట్‌లో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి, ఈసారి దాని ప్రస్తావనే లేకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు.

## ఎక్సైజ్ ఆదాయంపై అభ్యంతరం

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో ఎక్సైజ్ ఆదాయాన్ని రూ. 12 వేల కోట్లు అదనంగా పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడంపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రూ. 34 వేల కోట్లుగా ఉన్న ఎక్సైజ్ ఆదాయాన్ని రూ. 46 వేల కోట్లకు ఎలా పెంచుతారని, ఇందుకోసం ఊరూరా కొత్తగా బార్లు ఓపెన్ చేస్తారా అని నిలదీశారు. ఈ క్రమంలో ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని.. బీఆర్ఎస్ హయాంలోనే మద్యం ఆదాయం పెరిగిందని కౌంటర్ ఇచ్చారు. దీనిపై హరీశ్ రావు అసహనం వ్యక్తం చేస్తూ, తాను బడ్జెట్ గణాంకాలపై అడుగుతున్నానని, దీనికి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ చర్చలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా జోక్యం చేసుకుని ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.



# లచ్చ నాయక్ కు మంత్రి నివాళి

- హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సీతక్క

మహబూబాబాద్ మార్చి 23(ప్రభాత గమనం): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ పితృవియోగం పట్ల జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంతాపం వ్యక్తమవుతోంది. ఆయన తండ్రి జాటోత్ లచ్చ నాయక్ ఇటీవల కన్నుమూయడంతో గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం మచ్చర్లకు చేరుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళీ నాయక్ లచ్చ నాయక్, చిలువేరు సమ్మయ్య గౌడ్ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హుస్సేన్ నాయక్ కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క, ఉమా మురళీ నాయక్ పరామర్శించి వారిని ఓదార్చారు. తండ్రిని కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబం అంతా ధైర్యంగా ఉండాలని వారు కోరారు. ఒక ఆత్మీయ నాయకుడి కుటుంబంలో జరిగిన ఈ నష్టం తమను కలిచివేసిందని పేర్కొంటూ తమ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చెర్మన్, వ్యాప్తంగా ఉన్న కార్పొరేటర్లు, సర్పంచులు, వార్డు సభ్యులు మరియు వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి లచ్చ నాయక్ సేవలను స్మరించుకున్నారు. గ్రామానికి వచ్చిన ప్రతి ఒక్కరూ హుస్సేన్ నాయక్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకుంటూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఈటల ఫైర్


## బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై ఈటెల రాజేందర్ ఆగ్రహం



హైదరాబాద్, మార్చి 23 (ప్రభాత గమనం): జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై సీనియర్ నేత ఈటెల రాజేందర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మేమేం పార్ట్ టైమ్ రాజకీయ నాయకులం కాదు" అంటూ పార్టీ నిర్ణయాలపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను రాష్ట్ర నాయకత్వం కాకుండా స్థానిక పార్లమెంట్ నియోజకవర్గ నాయకులకే వదిలేయాలని సూచించారు. తమ పరిధిలోని అభ్యర్థులను తామే ఎంపిక చేసి బరిలోకి దింపుతామని స్పష్టం చేశారు. రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తాను ఇప్పటికే సర్వేలు నిర్వహించామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుల ఎంపికకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలపై తనకు సమాచారం ఇవ్వలేదని, పార్టీ వ్యవహారాల్లో తాను పక్కనపెట్టబడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నేతగా తనకు తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న నెగెటివ్ ప్రచారం వెనుక సొంత పార్టీ నేతలే ఉన్నారని ఆరోపిస్తూ, ఇటువంటి వ్యవహారం మంచిది కాదని హెచ్చరించారు. మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

-సిపిఎం అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి



గార్ల మార్చి 23(ప్రభాత గమనం) : యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో పయనిస్తూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వంగూరి కొండయ్య లు పిలుపునిచ్చారు. స్వాతంత్ర సమరయోధులు, విప్లవ వీర కిశోరం షాహిద్ భగత్ సింగ్ వర్ధంతిని సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ,ఐద్వా, సీఐటీయూ తదితర సిపిఎం అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు ప్రాంగణంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహం నుండి నెహ్రూ సెంటర్, డోర్నకల్ రోడ్,మెయిన్ బజార్, బయ్యారం రోడ్డు మీదుగా నెహ్రూ సెంటర్ వరకు సాగింది. అనంతరం స్థానిక భగత్ సింగ్ విగ్రహ వద్ద పూలమాలలు వేసి, కాగడాలను ప్రదర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ దేశంలోని ప్రజలకు వాక్ స్వాతంత్రమే కాకుండా, ఆర్థిక సామాజిక రాజకీయ స్వాతంత్ర్యంతో కూడిన సమానత్వం రావాలని భగత్ సింగ్ కోరుకున్నాడని అన్నారు.భగత్ సింగ్ రచనలు నేటి యువతరం అధ్యయనం చేయాలని సూచిం చారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న రాజగురు, సుఖదేవ్ లాంటి యువతరాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత అవినీతి రహితమైన రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జిల్లా, మండల నాయకులు వి వెంకటేశ్వర్లు, ఏ వీరస్వామి, యం. నాగమణి, సిహెచ్.మౌనిక,టి. రామా,ఎస్ కె.బాజీ, బి.శివకృష్ణ, చందు,టి. నవీన్,బి.నరేష్, శ్రీను, ఉమావతి, సుజాత,ప్రవీణ్, పూర్ణచందర్, అశోక్,మల్లయ్య, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- అన్ని వసతి గృహాల్లో పక్కాగా కామన్ డైట్ మెనూ పాటించాలి
- షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ మార్చి 23(ప్రభాత గమనం): సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ స్వయంగా గూగుల్ మీట్ ద్వారా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తరంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులు, కచ్చితంగా వసతి గృహాలను తనిఖీ చేసి, కామన్ డైట్ మెనూ, త్రాగునీరు, దుస్తులు, తదితర సౌకర్యాలను కచ్చితంగా తనిఖీ చేయాలని, వసతి గృహాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన "కీ "సంబంధిత అధికారి వద్ద ఉంచుకోవాలని సూచించారు.ప్రతి మెనూ గూగుల్ ఫోటో, జియో ట్యాగింగ్, తెప్పించుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ఆర్బీఎస్కే, వైద్య క్యాంపుల ద్వారా పిల్లలకు భోజనం సిద్ధం చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆవుల పద్మ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని అధికారులు తెలియజేయగానే తమకు ఉన్న పాత ఇల్లును కూల్చివేశామని కానీ ఇప్పుడు అది వేరే స్టేజీ లో ఉందని మంజూరు చేయలేదు తమకు పూర్వం ఎటువంటి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని తమ సమస్య పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.


- మహబూబాబాద్ మండలం శనిగపురం గ్రామానికి చెందిన ఉప్పలయ్య తమ గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్లలోని భూమిని ఆన్ లైన్ చేసి తనకు కొత్త పట్టా పాసుపుస్తకం ఇప్పించాలని అన్నారు.
- మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామానికి చెందిన కె.వెంకటాద్రి 2023 సంవత్సరంలో ప్రమాదం జరిగి కుడి కాలు, చేయి విరిగిందని తనకు సదరం ద్వారా జారీచేసిన సర్టిఫికేట్ ద్వారా వికలాంగుల పించను ఇప్పించాలరని కోరారు.
- గార్ల మండల కేంద్రానికి చెందిన సుందర్ తాను పుట్టుకతోనే వికలాంగుడనని తాను చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్నదని తనకు గార్ల మండల కేంద్రంలో సి.ఎస్.సి కేంద్రానికి అనుమతించి తన కుటుంబం ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు.

ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన (146 ) దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మా వార్డుల బాధ్యత మాదే

- మా వార్డుని ఆదర్శ వార్డ్ గా తీర్చిదిద్దుకుంటాం
- ప్రతిజ్ఞ పూనిన మున్సిపాలిటీ 8,9వ వార్డ్ ప్రజలు

కేసముద్రం మార్చి 23(ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 8,9వ వార్డుల ప్రజలు సోమవారం ఒక ముఖ్యమైన సామూహిక తీర్మానం చేశారు. రోడ్డు భద్రత, యువత భవిష్యత్తు సమాజ శ్రేయస్సు దృష్ట్యా, వార్డుల నివాసితులు అందరూ కలిసి కొన్ని కీలక నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.అనంతరం వార్డు ప్రజలు మాట్లాడుతూ..ఇకపై తమ వార్డుల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిర్ణయించుకున్నారు. అలాగే కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అంగీకరించారు.అదేవిధంగా, తమ వార్డుల్లో గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ, ఎవరూ గంజాయి వంటి మత్తు పదార్థాల వాడకం వైపు వెళ్లకూడదని సంకల్పించారు. ఇప్పటికే అలాంటి అలవాట్లు ఉన్నవారిని గుర్తించి, వారికి కౌన్సెలింగ్ మరియు రీహాబిలిటేషన్ చర్యలు చేపట్టి, మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమ వార్డ్ యందు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని నిర్ణయం తీసుకున్నారు.ఈ నిర్ణయాలతో తమ వార్డులను సురక్షితమైన, ఆరోగ్యకరమైన మరియు ఆదర్శప్రాయమైన సమాజంగా తీర్చిదిద్దాలని వార్డు ప్రజలు సంకల్పించారు. అందరూ ఒకే మాట మీద ఉండి, ఈ తీర్మానాలను కచ్చితంగా అమలు ఏప్రిల్ 2 నుండి 15 రోజుల పాటు అందరికి హెల్మెట్ వాడడం ఒక అలవాటుగా మారేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, యువత, పెద్దలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# అండర్ బ్రిడ్జ్ వద్ద రైతులకు దారి చూపాలి

- రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ కు వినతి

నెక్కొండ మార్చి 23(ప్రభాత గమనం):మండలంలోని గేటుపల్లి సమీపంలో ప్రస్తుతం జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ పనుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్‌కు సోమవారం సికింద్రాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మాజీ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ సభ్యుడు గటిక అజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతుల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అండర్ బ్రిడ్జ్ నిర్మాణం వల్ల గేటుపల్లి, గొల్లపల్లి, చంద్రుగొండ గ్రామాలకు చెందిన రైతులు తమ పొలాలకు, చెరువులకు మరియు బావుల వద్దకు వెళ్లే మార్గం మూసుకుపోయిందని వివరించారు. దీనివల్ల నిత్యం రాకపోకలు సాగించే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే ప్రత్యామ్నాయంగా నూతన మార్గాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ మాజీ వైస్ ఎంపీపీ ధోనికేనా సారంగాపాణి, గొల్లపల్లి సర్పంచ్ మైల కుమార స్వామి, ఉప సర్పంచ్ కత్తుల సదానందం, మూడు అఖిల్, భూక్యా జవహర్ లాల్ పాల్గొన్నారు.




# ఆశా వర్కర్లకు రూ.18 వేలు ఇవ్వాలి

- సిఐటీయు మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్

కేసముద్రం మార్చి 23(ప్రభాత గమనం): ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో వెంటనే ఆశ వర్కర్లకు రూ.18000 వేల వేతనం వెంటనే అమలు చేయాలని సిఐటీయు మండల కార్యదర్శి జల్లె జయరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు కొండేటి విజయ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జల్లె జయరాజ్ మాట్లాడుతూ..గత 14 రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లకు వెంటనే వేతనం పెంచాలన్నారు.ప్రభుత్వం సమ్మె చేసిన సందర్భంగా రూ. 18 వేల రుపాయల గౌరవ వేతనం ఇస్తామని చెప్పి నేడు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ఆశా వర్కర్లను అన్ని విధాల ఉపయోగించుకుంటూ వారికి వేతనం ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా కరోనా కష్ట కాలంలో ఆశా వర్కర్ల పనితీరు అద్భుతం అన్నారు. ఇల్లు ఇల్లు తిరిగి జ్వరాలు ఏ సమస్యలు లేకుండా అన్ని పరీక్షలు చేస్తూ వారికి మందులు ఇస్తూ ఒక అమ్మలెక్క ప్రజలందరినీ చూసుకుంటున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. ఆశా వర్కర్ల సేవలు మరువలేనివి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి రూ.18 వేల రుపాయల వేతనం ఇవ్వాలన్నారు.

# చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కేసముద్రం మార్చి 23(ప్రభాత గమనం): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన సోమవారం నాడు కేసముద్రంలో చోటు చేసుకుంది.ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం..మహబూబాబాద్ లోని హనుమంతుని గడ్డకు చెందిన అలువాల సాయిబాబా (29) అను వ్యక్తి ప్రతిరోజు చేపలు పట్టి అమ్మి జీవనం గడుపుతున్నాడు. రోజులాగానే ఆదివారం రోజున మధ్యాహ్నం అర్పణ పల్లి శివారులోని వట్టి వాగులో వలతో చేపలు పట్టడానికి వెళ్లి వస్తానని తన భార్య ఉమకు చెప్పాడు. మహబూబాబాద్ నుంచి బయలుదేరి కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామ శివారులోని వట్టివాగులో చేపలు పట్టడానికి వల వేయగా ప్రమాదవశాత్తు వల అతని కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగిపోయి చనిపోయాడు.మృతునికి కూతురు కారుణ్య, కొడుకు కౌశిక్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కేసముద్రం ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

మంగళవారం
24.03.2026
www.prabhatagamanam.com
PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎస్.రాములు నాయక్
- రైతే దేశానికి వెన్నెముక
- గడ్డి మందు నివారణకు ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్



మహబూబాబాద్, మార్చి 23 (ప్రభాత గమనం): తెలంగాణలోని ఇందిరమ్మ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పేర్కొన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్‌తో కలిసి స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## వాణిజ్య పంటల వైపు మళ్ళాలి

ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ.. రైతులు కేవలం వరి పంటకే పరిమితం కాకుండా, అధిక లాభాలు ఇచ్చే వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు మరియు అంతర పంటల ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో నేలలు అత్యంత సారవంతమైనవని, అందుకు తగిన విధంగా రైతులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉద్యానవన (Horticulture), వ్యవసాయ (Agriculture) అధికారులపై ఉందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, అవగాహనను కల్పించాలని ఆదేశించారు.

## ఆత్మహత్యల నివారణకు కృషి

జిల్లాలో చిన్న చిన్న కారణాలకే, క్షణికావేశంలో గడ్డి మందు సేవించి రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తొందరపాటు నిర్ణయాల వల్ల కుటుంబాలు అగమ్యగోచరంగా మారుతున్నాయని పేర్కొన్నారు. గడ్డి మందు (Herbicide) దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ గార్లను కలిసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రైతు పథకాలు - అమలు

రాష్ట్రంలో రైతు భరోసా, రైతు బీమా, పెట్టుబడి సహాయంతో పాటు సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ వంటి పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని రాములు నాయక్ వివరించారు. నకిలీ విత్తనాల నియంత్రణకు, నాణ్యమైన ఎరువుల పంపిణీకి ఫర్టిలైజర్ షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## పర్యావరణం, సామాజిక సంక్షేమం

అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మాట్లాడుతూ.. భూమి సారాన్ని కాపాడుకోవడానికి రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడకూడదని సూచించారు. ఎస్సీ, ఎస్టీ మరియు బహుజన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ కమ్యూనిటీల అభివృద్ధికి ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తితే కమిషన్ సభ్యులు నిత్యం అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి సరిత, హార్టికల్చర్ అధికారి మరియన్న, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంఓ డాక్టర్ జగదీష్, ఏడిఏ శ్రీనివాసరావు మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ఉరితాడును ముద్దాడిన షాహిద్ భగసింగ్

- ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి
- ఎంసీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకన్న



కేసముద్రం మార్చి 23(ప్రభాత గమనం): ఉరితాడును ముద్దాడిన వీరుడు షాహిద్ భగత్ సింగ్ అని ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. సోమవారం నాడు ఉప్పరపల్లి గ్రామంలో ఎంసిపిఐయు, ఏఐసిటియు, ఏఐఎఫ్డివైఎ ఆధ్వర్యంలో భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ ల 95వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడారు.. షహిద్ భగత్ సింగ్ ఆశయస్ఫూర్తితో యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం ప్రపంచ శాంతి కోసం పోరాడాలని ఆయన యువకులకు పిలుపునిచ్చారని తెలిపారు. భగత్ సింగ్, రాజ్ గురు,సుఖదేవ్ లు వలసవాదుల పాలన అంతం కావాలని,సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటిస్తూ భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కోసం ఉద్యమించారని తెలిపారు. ఉరితాడును మాలగా స్వీకరించి మా జీవితాలు సిద్ధాంతాల కన్నా గొప్ప కాదని చెప్పిన మహనుభావులన్నారు. బ్రిటిష్ వారిని దేశం నుండి తరిమికొట్టాలని దేశం కోసం ప్రాణాలర్పించిన సర్దార్ భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ లు మరణించి నేటికి 95 సంవత్సరాలు అని ఆయన అన్నారు.సామ్రాజ్యవాదులు తమ మార్కెట్ ల విస్తీర్ణం కోసం,తమ ఆధిపత్యం కోసం సహజ వనరులను దోచుకోవడానికి,తమను ఎదిరించిన వారిని, ప్రశ్నించిన దేశాల మీద యుద్ధాలు చేస్తున్నాయని తెలిపారు. అమెరికా, ఇజ్రాయిల్ లు సమిష్టిగా ఇరాన్ దేశం మీద యుద్ధం చేయడం మూలంగా మానవాళికి నష్టం జరుగుతుందని ఇటువంటి యుద్ధాలను చేయవద్దని, ప్రపంచ శాంతి కావాలని ఒక దేశ సార్వభౌమాధికారం మీద ఇంకొక దేశం దాడి చేయకూడదన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగ,ఉపాధి,ఉచిత విద్య, ఉచిత వైద్యం కోసం ఉద్యమాలు చేయాలని ఆయన యువతీ,యువకులకు పిలుపునిచ్చారు.ఈ పోరాటాలే భగత్ సింగ్,రాజ్ గురు ,సుఖదేవ్ లకు నిజమైన నివాళులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంపత్, బట్టు మురళి,సకినాల నరేష్,ఎండి షబ్బీర్, ఉపేందర్, కంచ కుమారస్వామి, బిజి గే సురేష్, మరుపాల కుమార్,బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

కేసముద్రం మార్చి 23(ప్రభాత గమనం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు 'చలో అసెంబ్లీ' అని పిలుపు నిచ్చిన నేపథ్యంలో కేసముద్రం మండలంలో సోమవారం తెల్లవారుజామున బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్,నాయకులు వేముల సతీష్ రెడ్డి, ముదిరెడ్డి మురళీధర్ రెడ్డి, సింగంశెట్టి మధుకర్, బానోతు రాములను కేసముద్రం పోలీసులు అర్ధరాత్రి ముందస్తుగా అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, 'ప్రజా పాలన' కాస్తా 'ప్రజా మోసం'గా మారిందని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ గొంతును అణచివేసిన ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని పిరికి పంద చర్యను బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు . ప్రజా సమస్యలపై పోరాడుతుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా సమస్యల పోరాటం ఆగేది లేదని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని వారు స్పష్టం చేశారు.




# అలంఖానిపేట అంగన్ వాడీకి ఎస్‌బీఐ చేయూత

- శాఖాధికారి ఐలయ్య చొరవతో డిజిటల్ టీవీ,ఆట వస్తువుల పంపిణీ..

నెక్కొండ మార్చి 23(ప్రభాత గమనం:మండలంలోని అలంకనిపేట అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నెక్కొండ శాఖాధికారి ఐలయ్య ప్రత్యేక చొరవతో పలు వసతులు కల్పించారు. ఎస్‌బీఐ 'సిఎస్ఆర్' నిధులతో సోమవారం కేంద్రానికి ఒక అధునాతన క్యూఎల్ఈడీ టీవీ, స్టీల్ వాటర్ ఫిల్టర్, బాస్కెట్‌బాల్ కిట్లు, ఆట వస్తువులు మరియు స్టేషనరీని అందజేశారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఐలయ్య మాట్లాడుతూ.. గ్రామీణ చిన్నారులకు నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బ్యాంకింగ్ పథకాల ద్వారా పొదుపు చేయాలని ఆయన సూచించారు. ఈ డిజిటల్ బోధనా పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని, వీటి వల్ల పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు సుమతి, సీత, అంగన్‌వాడీ టీచర్లు కనకవ్వ, వనజ, రాజేశ్వరి మరియు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.




Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra